క్లుప్తంగా

శ్మశాన అభివృద్ధికి ఆఫీసర్స్ క్లబ్ విరాళం



శ్మశాన అభివృద్ధి కమిటీకి విరాళం అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల రూరల్: హిందు శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చారు. కొత్తపేటలోని హిందు శ్మశాన అభివృద్ధికి కొత్తపేట ఆఫీసర్స్ క్లబ్ తరఫున నిర్వాహకులు, దాతలు గోవర్ధన్ మాస్టర్, మాధవరావు, కోటేశ్వరరావు, శివాజీ, పిఎన్. కిరణ్‌కుమార్, షేక్ కబీర్‌లు శుక్రవారం రావి జయలక్ష్మి కళ్యాణ మండపంలో స్మశానం అభివృద్ధి చైర్మన్ కరణం శ్రీనివాసబాబుకు రూ. 1 లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ మృతిచెందిన ప్రతి ఒక్కరూ ఆఖరి మజిలీగా శ్మశానంలోనికి చేరతారని అక్కడ ప్రశాంత వాతావణం ఏర్పాటు చేసేందుకు అభివృద్ధి కమిటీ నిర్వాహకులు ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. శ్మశాన అభివృద్ధికి గాను తమవంతు సాయంగా చిరుసాయం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్మశాన అభివృద్ధి కమిటీ సభ్యులు శంభు ప్రసాద్, తన్నీరు ప్రసాద్, విష్ణు, మొులకల మధు, రాము, విజయభాస్కర్, కోటేశ్వరరావు, సాంబశివరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక పరిపుష్టికి రోటరీ సాయం



మహిళలకు కుట్టు మిషన్‌లు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

ఇంకొల్లు (చినగంజాం): మహిళలు ఆర్థికంగా బలపడేందుకు వారి కుటుంబాలను వారే స్వయంగా పోషించుకునేందుకు రోటరీ క్లబ్ వారిని పలు విధాలుగా ఆదుకుంటుందని ఇంకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ షేక్ రఫీ అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో 11 మంది మహిళలకు 11 కుట్టుమిషన్‌లను ఉచితంగా అందజేశారు. మహిళలను అన్ని విధాలుగా బలోపేతం చేసేందుకే మిషన్‌లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చుండి సాంబశివరావు, ట్రెజరర్ అలవల రాఘవరెడ్డి, బద్రిరెడ్డి, జెట్టి స్వామి, హన్ను, నిమ్మగడ్డ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



పేరాలలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద యువకులు ఏర్పాటు చేసిన విద్యుత్ స్టార్



చీరాల సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చికి రంగులు వేసి పండుగకు ముస్తాబు చేస్తున్న యువకులు



కొత్తపేట ఐఎల్‌టీడీ కాలనీలోని లూథరన్ చర్చివద్ద ఏర్పాటు చేసిన స్టార్

క్రిస్మస్ సంబరాలు సిద్ధం

- క్రిస్మస్ పండుగకు చీరాల వాసులు సిద్ధం
- పండుగకు రంగులతో ముస్తాబవుతున్న చర్చిలు
- మిరుమిట్లు గొలిపే విద్యుత్ స్టార్ల ఏర్పాటు
- వ్యాపార సముదాయాలు, వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్‌లో సందడి

చీరాల రూరల్:

క్రిస్మస్ పండుగలకు చీరాల వాసులు సిద్ధమవుతున్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. పేద, ధనిక అనేతేడాలు లేకుండా ప్రతి ఒక్కరూ తమకు ఉన్నదానిలోనే ఎంతో సంతోషంగా పండుగను జరుపుకుంటారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న చర్చిలకు రంగులువేసి శుభ్రం చేస్తున్నారు. మిరుమిట్లు గొలిపే విధంగా రకరకాల విద్యుత్ స్టార్లను యువకులు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. పండుగ ఇంకా వారం రోజులు ఉన్నప్పటికి వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్‌లు, మార్ట్‌లు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి.

పట్టణంలో అధిక జనాభా..

చీరాల పట్టణంలో క్రైస్తవులు, క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో ఉన్నారు. విఠల్‌నగర్, దండుబాట రోడ్డు, ఉజిలిపేట, జాన్‌పేట, జయంతిపేట, మరియమ్మపేట, మేరి క్రిస్టియన్‌పేట, ఐక్యనగర్, విజయనగర్ కాలనీ, ఐఎల్‌టిడి రామనగర్, శాంతినగర్, నోవాహుపేట, పేరాల ఆనందపేట, శృంగారపేట, గాంధీనగర్, కొత్తపేట ఐఎల్‌టీడీ కాలనీ, హారిస్‌పేట, చర్చి కాంపౌండ్, ఉడ్‌నగర్, హయ్యర్‌పేట, థామస్‌పేట, ఎల్‌బీఎస్ నగర్, సాల్మన్ సెంటర్, బేర్ క్రిస్టియన్‌పేట, సిపాయిపేటలతో పాటు రూరల్ ప్రాంతాల్లో కూడా అధికంగా నివసిస్తుంటారు. కొన్ని కుటుంబాలు తప్ప అందరూ చిన్న చితకా కూలి పనులు రాడ్ బెండింగ్, సెంట్రింగ్, వడ్రంగి, పెయింటర్, బేల్దారీ పనులు చేసుకుంటూ తమ కుటుంబాలను నెట్టుకొస్తుంటారు. ఏడాదికి ఒకసారి వచ్చే క్రిస్మస్ పండుగను ఆయా ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంగా జరుపుకుంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అప్పోసొప్పో చేసైనా సరే కొత్త బట్టలు కొనుగోలు చేస్తారు.

కొనుగోళ్లతో హడావుడి..

క్రిస్మస్ పండుగ దగ్గర పడుతుందంటే వ్యాపార సముదాయాలు, వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్‌లు కిక్కిరిసిపోతాయి. ఇప్పటికే కొనుగోలుదారులతో ఆయా ప్రాంతాలు సందడిగా మారిపోయాయి. దుకాణదారులు లక్షలకు లక్షలు వెచ్చించి ఇతర ప్రాంతాల నుంచి (బట్టలు) కొత్తకొత్త స్టాకుతో తమ షాపులను నింపేశారు. ఆయా షాపింగ్ మాల్‌లలో రకరకాల మోడళ్లలో బట్టలు, వెస్ట్రన్ డ్రెస్‌లు దొరుకుతున్నాయి. ఇక మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్‌లో అయితే టెక్స్‌టైల్స్ వస్త్రాలు దొరుకుతాయి. ఈ మార్కెట్‌కు ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు హోల్‌సేల్‌గా బట్టలను తరలిస్తుంటారు. పెద్దపెద్ద షాపింగ్ మాల్‌లు ఏర్పాటు చేశారు. బట్టలకు సంబంధించి చీరాలకు చిన ముంబాయిగా పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖ పట్టణం నుంచి కూడా ఇక్కడకు వచ్చి వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు.



చీరాల హారిస్‌పేట యువకులు చీరాల-బాపట్ల ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన విద్యుత్ స్టార్



చీరాల జయంతిపేటలోని ప్రధాన రోడ్డు మధ్య వరుస విద్యుత్ స్టార్లు

చుక్కలంటుతున్న ధరలు..

బట్టల దుకాణాలు, షాపింగ్ మాల్‌లలో వస్త్రాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. నాసిరకం బట్టలు కూడా బ్రాండ్స్ పేరుతో నిర్వాహకులు ఆయా వస్త్రాలపై అధిక ధరలు ముద్రించిన స్టిక్కర్లు అతికించి కొనుగోలు దారుల జేబులు గుల్ల చేస్తున్నారు. ఉప్పు, పప్పులు, నిత్యావసర సరుకుల ధరలు చుక్కలనంటుతున్నాయి. ఏ వస్తువు చూసినా సామాన్యులు కొనలేని స్థితిలో ఉన్నారంటే ఏ మాత్రం అతిశయోక్తిలేదు. దుకాణదారులు ఇంత ధర అని ఫిక్స్ చేస్తే ఆ రేటుకు కొనుగోలు దారులు కొనాల్సిందే. ధరల నియంత్రణకు క్లెం వేయాల్సిన అధికారులు దుకాణదారులు మౌనం వహిస్తున్నారు. దుకాణదారులు అందించే ఆమ్యామ్యాలు పుచ్చుకుని మిన్నకుండి పోతున్నారని కొనుగోలు దారులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర మేల్కొని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ధరలను అదుపులో ఉంచాలని కొనుగోలుదారులు డిమాండ్ చేస్తున్నారు.

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దారుణం

చీరాల రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్ సమావేశాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణమే పదవి నుంచి తొలగించి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పించాలని దళిత మహాసభ నాయకుడు మాచవరపు జూలియన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లోని దళిత మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జూలియన్, చుండూరి వాసు, మల్లెల బుల్లిబాబు మాట్లాడారు. దేశ అత్యున్నతమైన పదవిలో కొనసాగుతున్న వ్యక్తి పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం జాతికి ఏమాత్రం గౌరవం కాదన్నారు. ఆయన ఏర్పాటు చేసిన రాజ్యాంగంలో రాజ్యాంగ బద్ధంగా పదవులు అనుభవిస్తు ఆయనను అవహేళన చేయడం ఎంత వరకు సమంసజసమని ప్రశ్నించారు. తక్షణమే ప్రధాని మోదీ స్పందించి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని, ఆయనతో దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు.

మార్టూరులో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం..

మార్టూరు: అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన కేంద్ర మంత్రి అమిత్ షా అదే పార్లమెంటు సాక్షిగా ఆయనను అవమానించడం సిగ్గుచేటని, అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని సమతా సైనిక దళ్ నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. మార్టూరులోని రాంనగర్, నేతాజీ కాలనీల మధ్యగల అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో సమతా సైనిక దళ్ నాయకుడు బొల్లాపల్లి బెన్నిబాబు మాట్లాడారు. నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సమతా దళ్ నాయకులు గొట్టిపాటి పవన్, గొట్టిపాటి రవితేజ, గోపతోటి కిషోర్, దారా సురేష్, నాని, భాస్కర్ పాల్గొన్నారు.



చీరాలలో మాట్లాడుతున్న దళిత మహాసభ నాయకులు

అద్దంకి రూరల్: అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ఐక్యవేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కోశాధికారి చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అంకం నాగరాజు, విశ్రాంత ఆర్‌జేడీ దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, తాళ్లూరి బాబూరావు, నక్క కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



మార్టూరులో నిరసన తెలుపుతున్న నాయకులు



అద్దంకిలో నినాదాలు చేస్తున్న ఐక్యవేదిక నాయకులు

అర్జీదారులు విచారణకు సహకరించాలి

వేటపాలెం: సమస్యలపై విచారణకు వచ్చిన అధికారులకు అర్జీదారులు సహకరించాలని తహశీల్దార్ పార్వతి సూచించారు. పుల్లరిపాలెం పంచాయతీ సాయినగర్ యానాది కాలనీ దగ్గరలో రొయ్యల చెరువులు ఉండటంతో భూగర్భ జలాలు కలుషిత మవుతున్నాయని, కాలనీకి దగ్గరలో ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల లెవల్ కమిటీ కాలనీలో శుక్రవారం విచారణ చేపట్టింది. అయితే విచారణకు ప్రధాన ఫిర్యాది యానాది హక్కుల పరిరక్షణ సంఘం ప్రెసిడెంట్ ఇండ్ల స్వాతి కాలనీలో అందుబాటులో లేదు. సంఘం కార్యదర్శి అందుబాటులో ఉండటంతో గతంలో కాలనీ సమస్యలపై విచారణకు వచ్చిన సందర్భంలో రాజకీయ పార్టీల నాయకులు కలగజేసుకోవడంతో విచారణను వాయిదా వేశామన్నారు. తదుపరి ఫోన్ ద్వారా అర్జిదారుడిని విచారించగా తాము కాలనీలో లేమని పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లామని చెప్పారన్నారు. ప్రస్తుతం రెండో రోజు కిందట ఫిర్యాది స్వాతికి నోటీసు ఇచ్చి విచారణకు వచ్చామని తహశీల్దార్ తెలిపారు. అయినప్పటికీ ఫిర్యాది అందుబాటులో లేదన్నారు. కాలనీ వాసులకు అన్ని విదలా అండగా ఉంటామని విచారణకు సహకరించాలని కోరారు. అయితే అర్జీదారు ఇండ్ల స్వాతి మాట్లాడుతూ తాము నిరక్షరాస్యులమని, రాజకీయ నాయకులు బెదిరిస్తున్నారని, తమకు ప్రాణహాని ఉందని తెలిపింది. విచారణ సమయంలో తమ సొసైటికి సంబంధించిన లీగల్ అడ్వైజర్ లాయర్‌ని అనుమతించాలని లేఖ ద్వారా తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు.



యానాది కాలనీ వాసులను విచారిస్తున్న తహశీల్దార్ పార్వతి, ఎస్సై

అతి తక్కువ ధరలతో కార్గో సేవలు

చీరాల అర్బన్: ఆర్టీసీ అమలు చేస్తున్న కార్గో సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చీరాల డిపో మేనేజర్ జె.శ్యామల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుపుతున్న కార్గో పార్శిల్, కొరియర్ సర్వీస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి జనవరి 19వ తేదీ వరకు ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 80 ముఖ్య పట్టణాలలో డిపోకు 10 కిలోమీటర్ల దూరంగా ఈ డోర్ డెలివరి సదుపాయం ఉందన్నారు. 50 కేజీల వరకు కొరియర్లు, పార్శిల్ తక్కువ ఖర్చుతో అతి తక్కువ సమయంలో భద్రంగా సరుకు రవాణా సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టాలి

జే.పంగులూరు: రేషన్ బియ్యం అక్రమ రవాణ, వ్యాపారాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే అరికట్టాలని రైతు సంఘం బాపట్ల జిల్లా నాయకుడు కందిమల్ల రామకోటేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పంగులూరులో మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని ప్రస్తుతం వినియోగదారులు ఉపయోగించుకోవడంలేదని, అందువలన కొంతమంది వాటిని ఉపయోగించుకొని అక్రమణ రవాణా, వ్యాపారం చేసి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం రైతుల దగ్గర ధాన్యం మొత్తం కొని, రేషన్ అవసరాలకు సరిపడా వాటిని ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేసి చౌక ధరల దుకాణం, దుకాణాలు సరఫరా చేయాలన్నారు. అలా చేయడం ద్వారా లబ్ధిదారులు బియ్యం తీసుకొని ఉపయోగించుకుంటున్నారని చెప్పారు.

వైభవంగా అమ్మవారి చండీహోమం

కారంచేడు: దశాబ్దాలుగా అమ్మవారి చండీ హోమంతో కారంచేడు ప్రాంతంలో భవానీ అమ్మవారి మాలధారుల నగరోత్సవం అత్యంత కన్నుల పండువగాను, వైభవోపేతంగాను నిర్వహించడం ఆనవాయితీ. మండల కేంద్రమైన కారంచేడు రెండు చెరువలు మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో ప్రతి ఏటా వందల మంది భవాని మాలధారులు ఇక్కడ నగరోత్సవం నిర్వహించి, చండీహోమంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆలయ ధర్మకర్తలు పోతిన వారి గృహం నుంచి అమ్మవారి నగలును సైతం మేళ, తాళాలు, కనకతప్పెట్లు, అమ్మవారి శరణు ఘోషలతో ఈ ప్రాంతం అంతా మారుమోగింది. అమ్మవారి నగలు తీసుకొని గ్రామోత్సవంగా వచ్చిన తీరు భక్తులకు పరవశింపచేసింది. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చండీ హోమంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలతో పాటు, అనేక ప్రాంతాల నుంచి వచ్చిన అర్చకస్వాములు, భవానీ మాలధారులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం పెద్ద ఎత్తున అన్న సంతర్పణ నిర్వహించారు.



కారంచేడులో గ్రామోత్సవంలో వైష్ణవీ దుర్గామాత నగల ఊరేగింపు

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జే.పంగులూరు: వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కొండమంజులూరు విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కొండమంజులూరు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించనట్లు పాఠశాల హెచ్‌ఎం ఇమ్మడిశెట్టి అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై జిల్లాస్థాయిలో పోటీలు జరగగా పాఠశాలలో 8 వ తరగతి విద్యార్థి చాతరాజుపల్లి పవన్ గోపీకృష్ణకు వ్యాసరచనలో ప్రథమ స్థానం, 9వ తరగతి విద్యార్థి కప్పెర జాన్‌బాబుకు వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం ఇమ్మిడి శెట్టి అనిత అభినందించారు. విద్యార్థులు ప్రోత్సహించి, తర్ఫీదు ఇచ్చి, విజేతలుగా నిలిపిన ఉపాధ్యాయులకు, విద్యార్థుల ఇద్దరికి ఈ నెల 24వ తేదిన బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో విజేతలకు రూ.3 వేలు ఒక్కొక్కరికి అందిస్తారని తెలిపారు. ఈ నెల 23వ తేదీన విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు.



విద్యార్థికి ప్రశంస పత్రం అందజేస్తున్న అధికారులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

చీరాల: స్థానిక దండుబాటలోని చీరాల నర్సింగ్ కాలేజ్‌లో శుక్రవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్, కళాశాల ఎండీ చవ్వా దుర్గారెడ్డి, చవ్వా ప్రదీప్ రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు సూచించిన విధంగా ప్రేమ, సేవ, దయాగుణం, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. నర్సింగ్ చదువుతున్న విద్యార్థినులు చక్కగా కోర్సు పూర్తి చేసి వైద్య సేవలు అంకితభావంతో అందించాలన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దివ్య, పాస్టర్ నెహేమియా, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న దేవరాజ్

క్షేత్ర సందర్శనలతో విజ్ఞానం పెంపు



మిర్చి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

చీరాల టౌన్: వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు క్షేత్ర సందర్శనలు చేయడం వలన పంటల సాగు, రైతులకు పలు సూచనలు చేయడంతో పాటు విజ్ఞానం పెరుగుతుందని మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామంలో సాగు చేస్తున్న మిర్చి పంటల సాగును బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పరిశీలించారు. మిర్చి సాగులో తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగించాల్సిన ఎరువులు. సాగు ఖర్చులు తగ్గించుకునే పలు సూచనలను రైతులకు అందించారు. వ్యవసాయ విద్యనభ్యసించే విద్యార్థులకు క్షేత్ర స్థాయి సందర్శనలు బాగా ఉపయోగపడుతాయని రమణారెడ్డి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డాక్టర్ సీతారాంబాబు, అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ పంపిణీ



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

పర్చూరు (చినగంజాం): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అమోఘమైనవని ఏపీ రాష్ట్ర లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. శుక్రవారం పూసపాడు విఘ్నేశ్వర సేవా కమిటీ భవనం నందు నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థిని కొమర్నేని గౌతమికి ల్యాప్‌టాప్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అందిస్తున్న సేవలు శ్లాఘనీయం అని అన్నారు. ఘంటా నాగభూషణం, వంకాయలపాటి శివరామకృష్ణయ్య కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ల్యాప్ టాప్ అందించినట్లు సంస్థ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ కమిటీ చైర్మన్ అలా అనంత రామారావు, డైరక్టర్ సాంబశివరావు, న్యాయవాది రెహమాన్, యలమంచిలి వేణు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

చీరాల: రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాలతో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నట్లు పార్టీ క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. అనంతరం చీరాల ఏరియా వైద్యశాలలో రోగులకు, బాలింతలకు పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి చీరాల నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

చినగంజాంలో..

చినగంజాం: మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు శనివారం మండల కేంద్రం చినగంజాంలో నిర్వహించనున్నట్లు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బాగంగా చినగంజాంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పుట్టిన రోజు వేడుకలకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

- పర్చూరు మండల కేంద్రం బొమ్మల సెంటర్ వద్ద శనివారం మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కఠారి అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు, కార్యక్రమాల అనంతరం అన్నదాన వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అద్దంకిలో..

అద్దంకి: పట్టణంలోని శింగరకొండ రోడ్డులోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పారీ కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకనలో తెలిపారు. కార్యక్రమానికి ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి నియోజకర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

సమయపాలన తప్పనిసరి

బల్లికురవ: గ్రామ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది విధుల్లో సమయపాలనతో పాటు బయోమెట్రిక్ వేయాలని ఎంపీడీవో కుసుమ కుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 21 పంచాయతీల్లోని సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. సర్వేల్లో అవకతవకలకు తావివ్వకుండా పకడ్బందీ పూర్తిచేయాలన్నారు. ఈవోఆర్డీ దాసరి సుమతి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల్లోని ప్రజలకు సెక్రటరీలో అందుబాటులో ఉండాలన్నారు.

బైకు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

మార్టూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురు యువకులు గాయపడిన ఘటన మార్టూరులో శుక్రవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దిలీప్ కుమార్, అతుల్‌లు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మద్దిరాలలో గ్రానైట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ శుక్రవారం రాత్రి బైకుపై మార్టూరులో గ్రానైట్ కార్మికుడిగా పనిచేస్తున్న తమ స్నేహితుని వద్దకు వచ్చారు. అనంతరం ముగ్గురూ కలిసి మార్టూరు నుంచి నాగరాజుపల్లి వైపు వెళ్లే రోడ్డులో వెళ్తూ వే బ్రిడ్జి సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో పడిపోయారు. ప్రమాదంలో దిలీప్ కుమార్ తలకు గాయం కాగా అతుల్‌కు తేలికపాటి గాయమైంది. మూడో వ్యక్తి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న బల్లికురవ 108 సిబ్బంది ముగ్గురిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.